మంచినీటికి కటకట


నరసాపురంలోని మంచినీటి కుళాయిచెరువు


పాత పైప్‌లైన్‌కు తరచు మరమ్మతులు (ఫైల్)

- నరసాపురంలో పైప్‌లైన్లకు లీకులు
- వృథాగా పోతున్న నీరు
- చాలా వార్డుల్లో మంచినీటి సమస్య

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో మంచినీటి కటకట అప్పుడే ప్రారంభమైంది. పైప్‌లైన్‌కు లీకేజీలు కారణంగా తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో కుళాయిల వద్ద రెండు బిందెలు కూడా నిండని పరిస్థితి ఉంది. పాత పైప్‌లైన్లు కావడంతో నిత్యం పైప్‌లైన్లు ఎక్కడో ఒకచోట లీకేజీ తప్పడంలేదు. మున్సిపాలిటీ వద్ద కనీసం పైప్‌లైన్ మరమ్మతు సామాగ్రి లేకపోవడంతో రోజుల తరబడి నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

70 ఎకరాల్లో చెరువు

జిల్లాలో ఎక్కడా లేని విధంగా నరసాపురం పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. మంచినీటి చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 60 వేల జనాభా ఉన్న పట్టణంలో 8,760 గృహ కుళాయి కనెక్షన్లు, 120 పబ్లిక్ కుళాయిలు, 596 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. మునిసిపల్ లెక్కల ప్రకారం చెరువులో అందుబాటులో ఉన్న నీటిని కాలువలు కట్టేసినా కూడా పట్టణ ప్రజలకు రెండు పూటలా వేసవిలో 65 రోజుల పాటు అందించవచ్చు. ఈ ఏడాది కూడా వేసవిలో రెండుపూటలా నీరందించాలని నిర్ణయించారు.

లీకేజీల తంటా

పట్టణంలో పైప్‌లైన్లు శిథిలమవ్వడంతో కుళాయిల ద్వారా సంవృద్ధిగా నీరు అందని పరిస్థితి నెలకొంది. 30వ వార్డు స్టేషన్‌పేటలో పైప్‌లైన్ లీకేజ్ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల వారికి గత 28 రోజులుగా నీరు సరఫరా కావడం లేదు. నిత్యం ఎక్కడో ఒకచోట పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో సరఫరా ఆగిపోతుంది. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాత పైప్‌లైన్ కావడంతో తక్కువ ప్రెషర్‌తో నీటిని వదులుతున్నారు. దీంతో శివారు ప్రాంతాలకు కుళాయిల ద్వారా సంవృద్ధిగా నీరందదు. ఒకవేళ ఎక్కువ ప్రెషర్‌తో నీటిని వదిలితే పైప్‌లైన్లకు ఎక్కువగా లీకేజీలు ఏర్పడే పరిస్థితి ఉంది. ఇది దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య. 1956లో మున్సిపాలిటీ ఏర్పడింది. 45 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్లను ఆధునికీకరించాలనే ఆలోచన గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదు.

అటకెక్కిన స్పెషల్ ప్రాజెక్ట్

రూ.61.81 కోట్లుతో పట్టణంలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌కు మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చొరవ చూపించారు. కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, అదనంగా ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణానికి ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. ఇక పట్టణంలో ఎక్కడా మంచినీటి ఇబ్బంది ఉండదని భావించారు. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్ట్‌ను అటకెక్కించింది.

మంచినీటికి ఇబ్బందులు



పట్టణంలో పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉంది. పైప్‌లైన్ల లీకేజీల సమస్య వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయడానికి చర్యలు చేపట్టాం. స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ నిర్మిస్తే ఇబ్బందులు ఉండేవి కాదు.

– బర్రి శ్రీవెంకట రమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారామపురం ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. కొప్పర్రు, లిఖితపూడి, మండవారి పేట, మంగళగుంటపాలెం, సరిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

పెనుగొండ: కరుగోరుమిల్లికి ముత్యాలవారి పాలెం గ్రామానికి చెందిన ఉపాధి హామీకూలీ ముత్యాల సత్యనారాయణ కుటుంబానికి రూ.2 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు సిర్రా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోదావరిలో ప్రమాదవ శాత్తు మునిగి మృతి చెందిన సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి అండగా నిలవాలని అధికారులను డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం : స్థానిక రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో సినిమా హాళ్లు, ఆసుపత్రులు ఉంటడంతో నిత్యం వందలాది ప్రయాణిస్తుంటారు. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేకపోవడం, మలుపులో గొయ్యి ఉండటంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. డ్రెయిన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికులకు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ప్రత్యేక బస్సులు, తీర్థయాత్రల బస్సుల ఏర్పాటు, ఆర్టీసీ కార్గో సర్వీస్‌లు, సిబ్బంది ప్రవర్తన తదితర సమస్యలపై ఫోన్ నెంబర్ 99592 25488కు ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రయాణికుల సూచనలు, సలహాలు కూడా ఇవ్వాలని కోరారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

పాలకొల్లు (సెంట్రల్): పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సీహెచ్ శ్రీనివాసు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారం అభినందనీయం


విద్యార్థి తల్లిని సత్కరించిన ఎంఈఓ, ఉపాధ్యాయులు

కాళ్ల: గ్రామస్తుల సహకారంతో ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ ఎ.రవీంద్ర అన్నారు. గురువారం సీసలి మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల (స్పెషల్) వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రభుత్వ బడిలో ఉండే చిన్నారుల సామర్థ్యాలను కొనియాడారు. విద్య ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులను సత్కరించారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి వారికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందించారు.

పెనుగొండలో కొవ్వొత్తుల ర్యాలీ


పెనుగొండలో కొవ్వొత్తుల ర్యాలీ

పెనుగొండ: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం రాత్రి స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో మృతులకు నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల ఏరివేతకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కొండవీటి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు గుర్రాల సూరిబాబు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొంతేరులో నాటికల పోటీలు

యలమంచిలి: అఖిల భారత స్థాయ నాటిక పోటీలకు కొంతేరు గ్రామంలోని పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరం ముస్తాబైంది. 43వ వార్షిక అఖిల భారత స్థాయి నాటిక పోటీలు శుక్ర, శని, ఆదివారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని యూత్ క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. మొదటి రోజు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, కొంతేరు అల్లుడు ఆకుల వెంకట శేషసాయి, దుర్గాంబ (గీత) దంపతులను సన్మానిస్తామన్నారు. ఈ నాటిక పోటీలు ప్రారంభం నుంచి క్రియాశీలకంగా పని చేసి ఇటీవల మరణించిన జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్, బొండాడ వెంకట రాధా రమణ గుప్త, రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) పేర్లను పరిషత్ నిర్వహించే మూడు రోజులు వేదికకు ఒక్కో రోజు ఒకరి పేరున పోటీలు నిర్వహిస్తామని వివరించారు.


నాటిక పోటీలకు ముస్తాబైన కళామందిరం

ఏడు నాటికల ఎంపిక

ఈ ఏడాది నాటిక పోటీలకు ఏడు నాటికలను ఎంపిక చేశామన్నారు. తొలి రోజు తొలి ప్రదర్శనగా గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారిచే ద్వారబంధాన చంద్రయ్య నాయుడు, మలి ప్రదర్శనగా హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోషియేషన్ వారిచే స్వేచ్ఛ ప్రదర్శిస్తారని తెలిపారు. రెండో రోజు తొలి ప్రదర్శనగా హైదరాబాద్ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ వారిచే నా శత్రువు, రెండో ప్రదర్శనగా విజయవాడ శ్రీ అభ్యుదయ ఆర్ట్స్ వారిచే అంగికం భువనం యశ్య, మూడో ప్రదర్శనగా కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ వారిచే జనరల్ భోగీలు నాటికలు ప్రదర్శిస్తారని వివరించారు. మూడో రోజు ఉత్తరాంధ్ర శ్రీ సౌజన్య కళా స్రవంతి వారిచే దేవరాగం, రెండో నాటికగా పాలకొల్లు శ్రీ నటీ నట సంక్షేమ సమాఖ్య వారిచే అనూహ్యం నాటికలు ప్రదర్శిస్తామని మురళీకృష్ణ తెలిపారు. నాటిక ప్రియులంతా ఈ నాటికలను తిలకించాలని ఆయన కోరారు.

డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

పాలకొల్లు (సెంట్రల్): స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్మెంట్ సెల్, వేకెంట్ హైయిర్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ తిరువీధుల రాజరాజేశ్వరి అధ్యక్షతన జాబ్ మేళా నిర్వహించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న వివిధ కళాశాలల విద్యార్థులు, ఏఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థులు 150 మంది హాజరుకాగా, వీరిలో 45 మంది ఉద్యోగ అవకాశం పొందారని ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. వీరిలో ఏఎస్ఎన్ఎం కాలేజీ విద్యార్థులు 34 మంది, ఇతర కాలేజీల విద్యార్థులు 11 మంది ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐ.క్యూఎస్సి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, జేకేసీ కోఆర్డినేటర్ ఎస్‌వీడీ దినకరన్, జేకేసీ ఫుల్ టైం మెంటర్ ఎంఎల్‌డీ శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు, హెచ్‌ఆర్‌లు

ఆక్వా క్రాప్ హాలిడేకు సహకరించాలి

పాలకొల్లు(సెంట్రల్): ఆక్వా రైతులు సమస్యలు పరిష్కారం కావాలంటే ఆక్వా క్రాప్ హాలిడేకు సహకరించాలని పాలకొల్లు, నర్సాపురం, ఆచంట నియోజకవర్గాల ఆక్వా సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. గురువారం మండలంలోని జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం ఆధ్వర్యంలో ఆగర్రు, అగర్తిపాలెం, చందపర్రు గ్రామాల రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులు పడే కష్టాలు ప్రాసెసింగ్ కేంద్రాలకు, ఫీడ్ ఫ్యాక్టరీలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా క్రాప్ హాలిడే చేసి తీరాలన్నారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు క్రాప్ హాలిడేగా ప్రకటించనున్నట్టు వివరించారు. దీనికి రైతులు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జై భారత్ ఆక్వా సంఘం సభ్యులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్‌రాజు

ఘనంగా కామాక్షమ్మ జాతర


కామాక్షి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


కామాక్షి అమ్మవారి జాతరలో గరగల నృత్యాలు

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామం బాలం వారి పుంతలో ఉన్న కామాక్షమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, గరగల నృత్యాలు నడుమ అమ్మవారి ఘటాలను గ్రామ వీధులలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద బాలం వీరరాఘవులు దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మేడపాడు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతల సహకారంతో సుమారు మూడు వేల మందికి నవకాయ పిండి వంటలతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కుసంపూడికి ఘన సత్కారం

పెనుమంత్ర: బ్రాహ్మణ చెరువు సూర్యారావుపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలుగా పని చేసి స్వచ్ఛంద పదవి విరమణ చేసిన కుసంపూడి నాగలక్ష్మిని గురువారం ఆ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఘనంగా సత్కరించింది. పాఠశాలలో 23 సంవత్సరాలు పాటు పిల్లలకు నాణ్యమైన భోజనం వండి పెడుతూ తల్లిదండ్రుల మన్ననలూ అందుకున్న నాగలక్ష్మి వృద్ధాప్య కారణంగా పదవి విరమణ చేశారు. ఆమెకు చాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ వార్డు సభ్యులు అనురాధ, సీఐటీయూ మండల కార్యదర్శి కేఎస్ ప్రసాద్, కౌలు రైతు సంఘం నాయకులు కె.సుబ్బరాజు, గండి బాలాత్రిపుర సుందరి, సాగిరాజు లక్ష్మి దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కుసంపూడి నాగలక్ష్మి సత్కరిస్తున్న ఎస్ఎంసీ సభ్యులు

గ్రామీణ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ సేవలు

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాలకు సాఫ్ట్‌వేర్ సేవలు అందించేందుకు కార్యాలయాలు ప్రారంభించడం అభినందనీయమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం పెనుగొండ మండలం వెంకట్రామపురంలో లాంగ్‌బౌ సాఫ్ట్‌వేర్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్‌తో దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు పట్టణ, మెట్రో పాలిటన్ సిటీలు, రాజధాని పట్టణాలకే పరిమితమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పెనుగొండ లాంటి గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించడానికి వచ్చిన నిర్వాహకులు అభినందనీయులన్నారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, సాంకేతికంగా గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు పాల్గొన్నారు.


వెంకట్రామపురంలో సాఫ్ట్‌వేర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని

రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

భీమవరం (ప్రకాశంచౌక్): జువ్వలపాలెం రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రత అధికారి ఏఎస్ రెడ్డి గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల రా మెటీరియల్ క్షుణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో చికెన్ నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారని గమనించి, దానిని పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ ల్యాబోరేటరీకి పంపించారు. రెస్టారెంట్లలో వినియోగించే నూనెను పలు సార్లు మరిగించి వినియోగించిన అనంతరం అది నిరుపయోగమవుతుందని టీపీసీ మీటర్ ద్వారా నిర్ధారించి హోటల్ యజమానులను హెచ్చరించారు. ఈ నూనెను ఒక క్యాన్‌లో నిల్వ ఉంచి నూనెను ఏజెన్సీకి అప్పజెప్పాల్సిందిగా సూచించారు. ఆహార భద్రత నియమాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినచో వారి లైసెన్స్‌ను రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారి ఏఎస్‌రెడ్డి హెచ్చరించారు.


రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారి ఏఎస్ రెడ్డి

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు

కాళ్ల: ప్లాస్టిక్ వాడకం వల్ల ఏర్పడే నష్టం, ప్రబలే వ్యాధులపై ఎప్పటికప్పుడు పర్యావరణ నిపుణులు, వైద్యులు హెచ్చరిస్తునే ఉన్నారు. ఐనా క్షేత్ర స్థాయిలో ప్లాస్టిక్ వాడకం కొనసాగుతునే ఉంది. ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

మొక్కుబడిగా స్వచ్ఛత – శుభ్రత

ప్రభుత్వం మొక్కుబడిగా స్వచ్ఛత–శుభ్రత అంటూ అప్పుడప్పుడు ఒక వారం హడావుడి చేయడం తప్ప శాశ్వత పరిష్కారాలు చూపలేకపోతోందని పర్యావరణ వేత్తలు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యావరణాన్ని రక్షిస్తున్నట్లు రోడ్లు ఊడ్చడం, చెత్త ఎత్తడం వంటి ఫొటోలు దిగి ప్రచారానికే పరిమితవుతున్నారు.

పెద్ద దుకాణాల్లోనే విక్రయాలు

ప్లాస్టిక్ నిషేధించామని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. ప్లాస్టిక్ కవర్ల విక్రయాల నివారణకు చర్యలు తీసుకోకపోవడం, గ్రామాల్లో, పట్టణాల్లో అధికారులు ఏదో కంటి తుడుపు చర్యగా దుకాణాల్లో ఏడాదికోసారి తనిఖీలు నిర్వహించడం సర్వ సాధారణమైంది. ప్లాస్టిక్ కవర్లను దహనం చేయడం, జరిమానాలు విధించడం వంటివి చేస్తున్నారు. తనిఖీలు చేస్తారనే ఆలోచనతో వ్యాపారులు ఆ రెండు రోజులు మినహాయించి మిగతా రోజుల్లో యథావిధిగా ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నారు. అధికారులు మాత్రం పొట్టకూటి కోసం తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారికి జరిమానాలు విధిస్తున్నారు. కవర్లు విక్రయించే దుకాణాల జోలికి వెళ్లకపోవడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్లాస్టిక్ కవర్లను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రచార ఆర్భాటంగా ప్లాస్టిక్ నిషేధం

ఆకివీడు: పాలిథిథీన్‌పై యుద్ధం ప్రకటించాం. వాటి వినియోగాన్ని అంతమొందించాలి. పాలిథిన్‌తో పర్యావరణానికి ముప్పు అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసి, ఆచరణ అడ్రస్ లేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగంగా అమ్మకాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. పాలిథిన్ కవర్లు, గ్లాసులు, ఇతర పాలిథీన్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. మార్కెట్లలో పాలిథిన్ కవర్లు లేనిదే కూరగాయలు, మాసం, చేపలు వంటివి అమ్ముడవ్వని పరిస్థితి నెలకొంది. పండ్ల షాపుల్లోనూ, కాఫీ హోటళ్లలో పాలిథీన్ యథేచ్ఛగా వినియోగిస్తున్నా నగర పంచాయతీ అధికారులకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మురుగు బోదెలు, పక్కా డ్రెయిన్లు, రోడ్ల వెంబడి పాలిథిన్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకునే నాథుడు లేడు. ప్రచార ఆర్భాటానికే ప్రభుత్వం పాలిథీన్ వినియోగంపై నిషేధం విధించిందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాలిథీన్ కవర్లు, ఇతర వస్తువులను తయారు చేస్తున్న కంపెనీలను ఎందుకు మూయించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. 50 మైక్రాన్లకు మించి తయారైన వాటిని మాత్రమే వాడాలని సూచిస్తున్నా నిబంధనలను అమలు చేసేవారే లేరు. 40 మైక్రాన్లకు తక్కువ ఉన్న పాలిథీన్ సంచులను నిషేధించారు. రీ సైక్లింగ్‌కు ఉపయోగపడని రీతిలో అతి సూక్ష్మ పద్ధతిలో 8–10 మైక్రాన్ల కన్నా తక్కువ కల్గిన పాలిథిన్ సంచులు చలామణి అవుతున్నాయి. ఇవి పర్యావరణానికి మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. పాలిథిన్ తయారీ కంపెనీలకు పోటీగా మార్కెట్‌లో చైనా కవర్లు విజృంభిస్తున్నాయి. నిబంధలకు విరుద్ధంగా ఉన్న, చైనా కవర్లను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజల ఆలోచనలను డైవర్ట్ చేసేందుకే

స్థానిక సమస్యలపైనా, ప్రభుత్వంపై వచ్చే వ్యతిరేక భావాల నుంచి ప్రజలను దారి మళ్లించేందుకే పాలిథీన్ వ్యర్థాలు పాలకులకు, అధికారులకు గుర్తుకొస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకటి రెండు రోజులు హడావుడి చేసిన తరువాత వాటి ప్రస్తావనే లేకపోవడం దారుణమంటున్నారు. అధికారుల కళ్ల ఎదుటే పాలిథీన్ అమ్మకాలు చేపడుతుంటే ప్రభుత్వం, పైఅధికారుల నుంచి ఏ విధమైన ఆదేశాలు లేవని ధ్వజమెత్తుతున్నారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు



ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్‌తో పాటు జీర్ణకోశ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రెస్టారెంట్లలో వేడిగా ఉన్న పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో పార్సిల్ చేసి విక్రయిస్తున్నారు. దీని వలన వేడికి కవర్లు కరిగి వాటిలోని రసాయనాలు ఆహార పదార్థాలలో కలుస్తున్నాయి. దీని వలన శ్వాస, చర్మ సంబంధమైన వ్యాధులు సంక్రమిస్తాయి. మహిళల్లో గర్భస్రావం, రుతు సమస్యలు వస్తాయి.

–డాక్టర్ సరాబు సునీల్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, కాళ్ల

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరే


పెన్మెత్స ఏసురాజు, పాలకొల్లు


కొర్రపాటి వీరా స్వామి, పోడూరు


ఉచ్చుల స్టాలిన్‌బాబు, యలమంచిలి


కోరాడ శ్రీనివాస రావు, పాలకొల్లు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మండలాల వారీగా పాలకొల్లుకు పెన్మెత్స ఏసురాజు, పోడూరుకు కొర్రపాటి వీరాస్వామి, యలమంచిలికి ఉచ్చుల స్టాలిన్‌బాబు, పాలకొల్లు పట్టణానికి కోరాడ శ్రీనివాసరావు నియమితులయ్యారు.

అన్నసమారాధన


ఆలయం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న దృశ్యం

పాలకొల్లు (సెంట్రల్): శ్రీ మావూరమ్మవారి జాతర సందర్భంగా గురువారం ఉదయం స్థానిక అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ కర్నేన రోజా రమణి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మతికాని ఉమా సూర్యదేవునికి బూరెలు ఎగరవేసి అన్నసమారాధన ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కిషోర్, అనిల్ అచ్యుతరావు, భార్గవ్, మజ్జి కృష్ణ శ్రీలక్ష్మి, వేమన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో కనిపించని భూములు


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక పట్టణ శివారు చినమామిడిపల్లిలో దాదాపు 800 ఎకరాల పంట భూముల వివరాలు రెవెన్యూ అధికారులు చేసిన పొరపాటు కారణంగా ఆన్‌లైన్‌లో కనిపించడంలేదని 31వ వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జి ఫిర్యాదు చేశారు. గురువారం విజయవాడలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించని కారణంగా రిజిస్ట్రేషన్‌లు కావడంలేదని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని బాబ్జి వివరించారు.

ఇంగ్లిషుపై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

భీమవరం: ఉన్నత విద్యనభ్యసించడానికి ఇంగ్లీష్ అవసరమని అందువలన ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలని భీమవరం డీఎన్నార్ కళాశాల జాయింట్ సెక్రటరీ కె రామకృష్ణంరాజు అన్నారు. గురువారం వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ మే 3వ తేదీ వరకు ప్రతి రోజూ శిక్షణ తరగతులు ఉంటాయని వీటిని భీమవరం పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానవత అధ్యక్షుడు వెంకటపతిరాజు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో హోమం

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సంప్రదాయబద్ధంగా సుదర్శన సహిత భూ వరాహ లక్ష్మీనరసింహ హోమం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో గాదిరాజు శ్రీహరి రాజు, లావణ్య దంపతులచే అర్చకులు శ్రీనివాసాచార్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద మంత్రాలతో సుదర్శన సహిత భూ వరాహ లక్ష్మీనరసింహ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కుక్కల బాల, సరిపడకల రామారావు, జానపాటి మధు, పెన్నడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణికుమార్, అల్లం రమేష్, నళిని మోహన్, ఏడిద త్రిమూర్తులు, పద్మావతి మహిళా పారాయణం బృందం పాల్గొన్నారు.